సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం | 22 | ఆగస్టు | 2025



వణికిస్తున్న వైరల్ జ్వరాలు

పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా వైరల్ జ్వరాలు వణికిస్తున్నాయి. ప్రస్తుత సీజన్‌లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో దోమలు విజృంభిస్తున్నాయి. -10లో



వైభవంగా పూర్ణాహుతి

రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పుష్యమి నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. -10లో



ఆక్రమణలకు అడ్డే లేదా?

ఆక్రమణదారులకు ఎక్కడైతే ఏముంది. అది ప్రభుత్వ కార్యాలయం కావొచ్చు, ప్రైవేట్ స్థలం అవ్వొచ్చు. -10లో

న్యూస్‌రీల్

ఐటీడీఏలకు సబ్ కలెక్టర్లే ఇన్‌చార్జ్‌లు

సీతంపేట: పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏలకు ఇన్‌చార్జ్ పీవోలుగా సబ్ కలెక్టర్లనే నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఏడాది గడిచినా పూర్తి స్థాయిలో జిల్లాలో ఉన్న రెండు ఐటీడీఏలకు శాశ్వత పీవోలను ప్రభుత్వం నియమించలేదు. ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తున్నారు. ఇటీవల పాలకొండ సబ్ కలెక్టర్‌గా విధుల్లో చేరిన పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌కు సీతంపేట ఐటీడీఏ పీవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్.విశాలిని పార్వతీపురం ఐటీడీఏ పీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉల్లాస్‌తో అక్షర ఆంధ్ర

- డీఆర్‌డీఏ పీడీ సుధారాణి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సుధారాణి

పార్వతీపురం రూరల్: వయోజనులను చదవడం, రాయడంతో పాటు చిన్న చిన్న లెక్కలు చేయగలిగే విధంగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమ ఉద్దేశమని డీఆర్‌డీఏ పీడీ సుధారాణి అన్నారు. కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీఎస్‌డబ్ల్యూఎస్ ద్వారా నిర్వహించిన సర్వే ఆధారంగా జిల్లా వ్యాప్తంగా 2,01,058 మంది నిరక్షరాస్యులు ఉన్నారని, వారిని 2029నాటికి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే అక్షరాంధ్ర ఉల్లాస్ లక్ష్యమన్నారు. ప్రస్తుతం 2025-26 ఏడాదికిగాను 67,111 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా శాఖల ద్వారా వాలంటీర్ టీచర్లను గుర్తించి ఒక్కో టీచర్‌కు 10మంది చొప్పున నిరక్షరాస్యులను అప్పగించడం జరుగుతుందన్నారు. ఈ మేరకు మండల స్థాయి శిక్షణ పూర్తయ్యాక అంగన్‌వాడీ, స్థానిక ప్రభుత్వ భవనాల్లో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సెప్టెంబర్ నెల నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు వంద గంటలు వాచకాన్ని పూర్తి చేసేలా కార్యాచరణ చేశామన్నారు. శిక్షణలో ఇచ్చిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ఎన్ఐఓఎస్ ద్వారా ధ్రువీకరణ పత్రాలు ఇస్తామన్నారు. ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ, టి.వైకుంఠరావు, వయోజన విద్య అధికారి అప్పలనాయుడుతో పాటు జిల్లాలో ఉన్న పలువురు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సీడీపీవోలు, ఏపీఎంలతో పాల్గొన్నారు.

బడిదేవరకొండపై ఎమ్మెల్యే అంతర్యమేమిటో...!

పార్వతీపురం రూరల్: మండలంలోని బడిదేవరకొండను గురువారం సందర్శించిన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కొండపై జరుగుతున్న మైనింగ్ తవ్వకాలను నిలిపేయాలని ఆదేశించారు. కొంత కాలంగా అన్ని రకాల అనుమతులతో కంపెనీ యాజమాన్యం తవ్వకాలు ప్రారంభించింది. ఇక్కడ నుంచి గ్రానైట్ రాయిని కూడా లారీల్లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే బడిదేవరకొండను సందర్శించడం తవ్వకాలు నిలిపేయాలని ఆదేశించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటింది. ఉన్నట్టుండి ఇప్పుడు ఈ ఆదేశాలు వెనుక ఉన్న మర్మమేమిటన్న సందేహాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. కొద్ది కాలం కిందట కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాలు, గిరిజన సంఘాలు ఈ కొండ తవ్వకాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేశారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు కొండ చుట్టూ ఉన్న చెరువులకు నీరు చేరదని ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్‌కు వినతులు కూడా ఇచ్చారు. ఆ సమయంలో నోరు మెదపని ఎమ్మెల్యే అకస్మాత్తుగా తన అనుచరులతో, స్థానిక గిరిజనులతో కలిసి బడిదేవరకొండపైకి వెళ్లి పనులు ఆపేయాలని ఆదేశించడం చర్చనీయాంశమైంది. ఇక నుంచి తవ్వకాలు చేయొద్దని, మరోసారి పరిసర గ్రామాల ప్రజల అభిప్రాయాలు తీసుకున్న తరువాత పనులు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటి వరకు సదరు యాజమాన్యానికి సహకరించిన ఎమ్మెల్యే ఒక్కసారి ఇలా చర్యలకు దిగడం వెనుక అంతర్యమేమిటోనని చర్చ నడుస్తోంది. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడారు. మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ తరువాతే పనులు చేపట్టాలని ఆదేశించినట్టు చెప్పారు.

విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం పెరగాలి

విజయనగరం అర్బన్: విద్యార్థికి కళాశాల దశ నుంచి పరిశోధనా దృక్పథం పెరగాలని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి అన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఏటీఎల్ మెంటార్‌షిప్ ప్రోగ్రాంను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి కేంద్రిత పరిశోధన, ప్రాజెక్టులకు యూనివర్సిటీ అందిస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేతన వెతలు..!

- గ్రీన్ అంబాసిడర్ల అవస్థలు
- జీతాలు ఎప్పుడు చెల్లిస్తారు బాబూ...
- పది నెలలుగా జీతాలు చెల్లించని కూటమి ప్రభుత్వం
- జిల్లా వ్యాప్తంగా కష్టాల్లో 943 మంది కార్మికుల కుటుంబాలు



అధికారుల పర్యవేక్షణలో చెత్తను సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు(ఫైల్)


పార్వతీపురం రూరల్:

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు నిర్వహించే గ్రీన్ అంబాసిడర్లను కూటమి ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. గ్రామాల్లో చెత్త సేకరణ, పారిశుధ్య పనులు నిర్వహించే వీరికి సకాలంలో జీతాలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో అర్ధాకలితో అలమటిస్తూ వారి కుటుంబాల పోషణ కష్టంగా మారింది. పంచాయతీల నిధుల నుంచి వీరికి జీతాలు చెల్లించాల్సి ఉండగా... ఆ పంచాయతీల్లో నిధుల్లేక వీరి వేతనాలు చెల్లింపులు జరగడం లేదు. పంచాయతీలకు ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు రాకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో ఏ ప్రభుత్వ కార్యక్రమం జరిగినా మొట్టమొదటిసారిగా ఈ గ్రీన్ అంబాసిడర్లతోనే పరిశుభ్రత చర్యలు చేపడుతున్నారు. అటువంటి వీరికి సుమారు పది నెలలుగా జీతాలు చెల్లించాల్సి ఉన్నా.. ఆ ఊసే కూటమి నేతలు ఎత్తడం లేదు. వీరికి నెలకు రూ.ఆరు వేలు వేతనంగా ఉంది. పది నెలలుగా జీతాలు చెల్లించకుండా పనులు చేయించుకుంటోంది. ఇదెక్కడి న్యాయం అంటూ స్థానిక పాలకులను, అధికారులను ఆశ్రయించినా రాజకీయ కక్షలతో వేధింపులకు గురి చేస్తూ వారిని ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఈ క్రమంలో చేసేది ఏమీ లేక నమ్ముకున్న ఉపాధిని వదుకోలేక సకాలంలో జీతాలు రాకపోయినా పనులు కొనసాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర పేరిట ఏ కార్యక్రమం చేపట్టినా వాటికి పునాదిగా నిలబడేది ఈ గ్రామీణ పారిశుధ్య కార్మికులే. ఇటువంటి చిరు ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయడంపై గ్రామీణ ప్రజలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కొద్దిపాటి మొత్తం చెల్లింపులో ఇంత తాత్సారం చేస్తుండడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో మండలాల వారీగా ఉన్న గ్రీన్ అంబాసిడర్లు

మండలం	గ్రీన్ అంబాసిడర్లు
బలిజిపేట	66
గరుగుబిల్లి	55
కొమరాడ	77
మక్కువ	28
పాచిపెంట	83
పార్వతీపురం	69
సీతంపేట	67
సీతానగరం	82
సాలూరు	46
భామిని	49
గుమ్మలక్ష్మీపురం	64
జియ్యమ్మవలస	66
కురుపాం	58
పాలకొండ	61
వీరఘట్టం	72
మొత్తం	943

కొన్ని చోట్ల విధులకు దూరంగా...



సకాలంలో జీతాలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో జిల్లాలో ఇప్పటికే అక్కడక్కడా అసంతృప్తితో కొంతమంది గ్రీన్ అంబాసిడర్లు స్వచ్ఛందంగా విధుల నుంచి తప్పుకున్నారు. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లో చెత్తకుప్పల నిల్వలు ఎక్కడికక్కడ దర్శనమిస్తూ పారిశుధ్య లోపాన్ని ఎత్తిచూపే విధంగా పరిస్థితులు నెలకొన్నాయి. పంచాయతీలో నిధులు జీతాలు ఇచ్చేందుకు లేవని, పంచాయతీ కార్యదర్శులు సమాధానమిస్తూ... ఏడాదిగా జీతాలు చెల్లించకుండా ఇబ్బందులు పాల్జేస్తున్నారని ఇటీవల కలెక్టర్ సమక్షంలోనే ఓ పారిశుధ్య కార్మికుడు తమ ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలోనే కన్నీరు పెట్టుకున్నాడు. ఇలా కొందరు బయట పడుతుండగా.. మరికొందరు తమ ఆవేదనను మనసులోనే దాచుకుంటూ కుటుంబ జీవనాన్ని కొనసాగించలేక అవస్థలు పడుతున్నారు. తమ జీతాలు కూటమి ప్రభుత్వం ఎప్పుడు చెల్లిస్తుందా... అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వం తీరు సరికాదు

గ్రామాల్లో చెత్త, చెదారం, మురికి కుంటలను శుభ్రం చేస్తూ గ్రామాల పరిసర ప్రాంతాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచేందుకు నిరంతరం శ్రమిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించకపోవడం సరికాదు. మున్సిపల్ కార్మికులు, ఈ గ్రీన్ అంబాసిడర్లు నిర్వహించే విధులు ఒకేలాంటివైనా గ్రీన్ అంబాసిడర్ల జీతాలు 6వేలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ అరకొర జీతం కూడా సక్రమంగా చెల్లించకపోవడం దారుణం. ఈ మేరకు ఇప్పటికే నిరసన వ్యక్తం చేసేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో పిలుపునివ్వడం జరిగింది. అలాగే జీతాలు పెంపుదల కూడా చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

– వై.మన్మథరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

కార్యదర్శులను ఆదేశించాం

గ్రీన్ అంబాసిడర్లకు ఎప్పటికప్పుడు జీతాలు చెల్లించాలని ఆయా పంచాయతీల కార్యదర్శులకు ఆదేశించాం. బకాయిలు ఉన్న చోట మా దృష్టికి వచ్చిన వెంటనే చెల్లింపులు చేసేందుకు చర్యలు తీసుకొనేలా కార్యాచరణ చేస్తున్నాం.

– కొండలరావు, డీపీవో, పార్వతీపురం మన్యం జిల్లా

ఆర్ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో మిగులు సీట్ల భర్తీ నిమిత్తం మూడో విడత ప్రవేశాలకు ఈ నెల 29న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 26లోగా ఆన్‌లైన్‌లో సమర్పించడంతో పాటు ఈ నెల 26న సమీపంలోని ఐటీఐల వద్దకు వెళ్లి వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆ ప్రక్రియ పూర్తయిన విద్యార్థులకు మాత్రమే ఈ నెల 29న జరిగే అడ్మిషన్ల కౌన్సెలింగ్‌కు అనుమతి ఉంటుందని తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 6304086821 నంబరును సంప్రదించాలని తెలిపారు.

ఏసీబీ వలలో వీఆర్‌వో



లంచం నగదుతో ఏసీబీకి పట్టుబడిన వీఆర్‌వో సత్యవతి

వేపాడ:

మండలంలోని శింగరాయి వీఆర్‌వో కె.సత్యవతి ఏసీబీ వలకు చిక్కారు. దీనికి సంబంధించి ఏసీబీ డీఎస్పీ ఎస్.రమ్య అందించిన వివరాలు.. తన రెవెన్యూ పరిధిలో ఒక రైతు అనుభవంలో ఉన్న శింగరాయి, గుడివాడ భూములకు మ్యుటేషన్ దరఖాస్తు చేశారు. ఇందుకోసం వీఆర్‌వో సత్యవతి సంబంధిత రైతు నుంచి రూ.లక్షా 70వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధిత రైతు ఏసీబీని ఆశ్రయించడంతో ఏసీబీ డీఎస్పీ ఎస్.రమ్య ఆధ్వర్యంలో అధికారులు గురువారం సాయంత్రం వేపాడ సమీపంలో కళ్లాల వద్ద ఫిర్యాదుదారి నుంచి రూ.లక్ష నగదు తీసుకుంటుండగా పట్టుకున్నారు. అక్కడ నుంచి వీఆర్‌వోను వేపాడ తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చారు. వీఆర్‌వో సత్యవతి విధులు నిర్వహిస్తున్న గ్రామాలకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను కంప్యూటర్లలో పరిశీలిస్తున్నారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాడుల్లో ఏసీబీ సీఐ ఎం.మహేశ్వరరావు, ఎస్ఐ వాసు నారాయణ, సిబ్బంది, మహిళా పోలీసులు, ఆర్ఐ రామలక్ష్మి పాల్గొన్నారు.

టీడీపీలో రగిలిన అసమ్మతి

శృంగవరపుకోట: మండలంలోని కృష్ణమహంతిపురం పీఏసీఎస్ కార్యవర్గం నియామకంతో తెలుగుదేశం పార్టీలో నెలకొన్న అసమ్మతి కుంపటి రాజుకుంది. పీఏసీఎస్ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని బుధవారం బహిష్కరించిన ఆ పార్టీ నేతలు గురువారం గరవపాలెం గ్రామంలో సమావేశమై పార్టీ నేతల తీరుపై నిప్పులు చెరిగారు. పీఏసీఎస్ డైరెక్టర్ పదవిని తిరస్కరించిన పెంటకోట రమణబాబు సహా ఐదు పంచాయతీల పరిధిలోని నాయకులు కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు. 750 మంది రైతులున్న సొసైటీలో కేవలం 20 మంది రైతులున్న పంచాయతీకి చెందిన వ్యక్తిని చైర్మన్‌గా ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. పార్టీ అంటే ఇద్దరు వ్యక్తులదేనా... ఏంటి ఈ పంపకాలు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరితో సమావేశమై నిర్ణయాలు తీసుకున్నారని ప్రశ్నించారు. నామినేటెడ్ పదవులిస్తే పార్టీకి అదనపు బలం చేకూరాలని...ఇక్కడ అలా జరగడం లేదని ఆగ్రహించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం బహిష్కరించడం బాధ కల్గించినా తప్పలేదన్నారు. ఈ విషయాన్ని పార్టీ పెద్దల దృష్టికి తీసుకువెళ్తామని రమణబాబు తదితరులు తెలిపారు. ఒంటెద్దు పోకడ నిర్ణయాలు భవిష్యత్‌లో జరిగే ఎన్నికల్లో పార్టీకి నష్టం చేకూర్చుతాయన్నారు. సమావేశంలో ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, మాజీ ఎంపీపీ ఒంటి అప్పారావు, సర్పంచ్ యాళ్ల రమణ, ఎంపీటీసీ బోదల దేముడు, ఆడారి సూరిఅప్పారావు, అల్లూరి సత్యనారాయణరాజు, ఐ.శ్రీనివాసరాజు, ఆడారి అప్పారావు, యర్రపాటి సూర్యనారాయణ, కాంద్రేగుల విశ్వేశరరావు, డీపీఏ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

25లోగా చెరువుల ప్రతిపాదనలు రావాలి : కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, పలు శాఖాధికారులు

పార్వతీపురం రూరల్: జిల్లాలోని మైనర్ ఇరిగేషన్ చెరువుల కోసం ప్రభుత్వం ఆర్ఆర్ఆర్ (మరమ్మతులు, పునఃనిర్మాణం, పునరుద్ధరణ) కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. దీని ద్వారా చిన్న నీటిపారుదల మౌలిక సదుపాయాల పరిస్థితి, నిర్వహణ మెరుగు పరచడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తిని పెంచే ప్రయత్నాల్లో కీలకమైన భాగం కానుందన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నీటి పారుదల శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని మైనర్ ఇరిగేషన్ చెరువులకు సంబంధించి ఈ కార్యక్రమం కింద ప్రతిపాదనలన్నీ సిద్ధం చేయాలన్నారు.

25 నాటికి డాక్యుమెంట్లు అప్‌లోడ్ పూర్తి

ప్రభుత్వం సూచించిన విధంగా ప్రతీ శాఖలో గల డాక్యుమెంట్ల అప్‌లోడ్ ఈ నెల 25 నాటికి పూర్తవుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయనంద్‌కు వివరించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో కలెక్టర్ పలు శాఖాధికారులతో కలసి పాల్గొన్నారు. ఈ సమావేశంలో గ్రౌండ్ వాటర్, సానుకూల ప్రజాదృక్పథం, ఏజెంట్ స్పేస్ కోసం డాక్యుమెంట్ అప్‌లోడ్, స్వమిత్వ స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించినట్టు కలెక్టర్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ప్రత్యేక ఉప కలెక్టర్లు పి.ధర్మచంద్రారెడ్డి, దిలీప్‌చక్రవర్తి, నీటి పారుదల శాఖ ఈఈ ప్రదీప్, భూగర్భ జలవనరుల శాఖ ఈఈ రామ్మూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, సీపీఓ ఆర్‌కె.పట్నాయక్, డీపీవో కొండలరావుతో పాటు మరికొందరు అధికారులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాల లెక్కకు లోకోస్

- కొందరికి మోదం.. కొందరికి ఖేదం..!
- లోకోస్ యాప్‌పై భిన్నాభిప్రాయాలు
- ఇక్కడి సమాచారం అంతా ఢిల్లీ చేతికి
- ఐకేపీ సిబ్బంది స్మార్ట్ ఫోన్లలో సాంకేతిక సమస్యలు
- డేటా నమోదుకు తంటాలు
- కొందరికి సహకరిస్తున్న యాప్‌లు



మహిళా సంఘాల సభ్యులు

రాజాం:

మహిళా సంఘాల పనితీరు, నెలవారీ సమావేశాలు, రుణాల మంజూరీ, చెల్లింపులు, లావాదేవీలన్నీ ఐకేపీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ఇప్పటి వరకు నిర్వహిస్తున్నారు. ఇక ముందు పొదుపు సంఘాల లెక్కలన్నీ పక్కాగా ఉండేలా, ఎవరి లావాదేవీలు వారికి తెలిసేలా లోకోస్ యాప్ పని చేస్తుంది. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు, నెలవారీ చెల్లింపులు, బకాయిలు, డిఫాల్ట్ సభ్యుల వివరాలు వంటివి ఈ యాప్‌లో నమోదు చేయనున్నారు. ఈ పనులన్నీ ఆయా గ్రామాల్లోని వీవో లీడర్లు పర్యవేక్షిస్తారు. మొత్తం సమాచారం కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి విభాగానికి అనుసంధానం చేయబడుతుంది. ఇక్కడ మహిళా సంఘాల మొత్తం డేటా ఢిల్లీలో దర్శనమిస్తోంది. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ వంటి రుణాలు బినామీలకు వెళ్లకుండా చెక్ పడుతోంది.

ఇప్పటికే శిక్షణ

లోకోస్ యాప్ వినియోగంపై జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు ఐకేపీ విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. అపోహలు విడనాడి ఈ యాప్‌ను వినియోగించుకోవాలని సూచిస్తోంది. అన్ని మండలాల్లో వీవోఏలు, వెలుగు సిబ్బందికి ఈ మేరకు అవగాహన కల్పించారు. గ్రామాల్లోని మహిళా సంఘాల వివరాలన్నీ ఈ యాప్‌ల్లో నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సీసీలు, సీఏఫ్‌లు, వీవోల ఆండ్రాయిడ్ మొబైల్స్‌కు ఈ యాప్‌లు ఇచ్చి ప్లే స్టోర్‌లో భద్రం చేశారు. ఈ విధానం ద్వారా దేశ వ్యాప్తంగా పొదుపు సంఘాలన్నీ ఒకే గొడుగు కిందకు రానున్నాయనేది డీఆర్‌డీఏ వాదన. ప్రతీ సంఘంలోని లావాదేవీలు, ప్రతీ సభ్యురాలి ఆర్థిక లావాదేవీలు, సంఘ వినియోగం ఈ యాప్‌లో నమోదు చేయబడుతోంది.

జిల్లాలో 62,850 సంఘాలు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 62,850 సంఘాలు ఉన్నాయి. వీటిలో 6,92,155 మంది సభ్యులు ఉన్నారు. వీరందరి వివరాలు లోకోస్ యాప్‌లో నమోదు చేసేందుకు జిల్లా డీఆర్‌డీఏ విస్తృతంగా చర్యలు చేపట్టింది. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చిన ఆ శాఖ ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి మొత్తం వివరాలు నమోదు పూర్తి చేయాలని హుకుం జారీ చేసింది. ఇప్పటి వరకూ 85 శాతం దాటి వివరాలు నమోదైనట్టు డీఆర్‌డీఏ వెల్లడించింది.

పారదర్శకత నిజమేనా..!

లోకోస్ యాప్‌పై కొంతమందికి అపోహలు ఉన్నాయి. ఇక్కడి సమాచారం అంతా వేరే చోటకు చేరిపోతుందని, వ్యక్తిగత ఆర్థిక వివరాలు మొత్తం ఢిల్లీకి చేరిపోతాయని కొందరు ఆరోపిస్తున్నారు. తమ వద్ద ఆ యాప్‌లు, మొబైల్స్ లేనప్పుడు అవి తమకు ఎలా తెలుస్తాయని కొందరు మహిళలు వాదిస్తున్నారు. కొందరు వీవోఏలు ఈ యాప్‌ను వినియోగించేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ యాప్ ద్వారా తమ ఉనికికి ముప్పు వాటిల్లుతుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇందులో ఎంత వరకూ పారదర్శకత ఉంటుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా కనిపిస్తోంది. ఈ యాప్ వాడడం ద్వారా సంఘాలకు, అందులోని మహిళలకు పైసా వేసినా, తీసినా తెలుస్తుందని డీఆర్‌డీఏ వివరిస్తుంది.

ఒక్కోలా..

లోకోస్ యాప్‌లో మహిళా సంఘాల వివరాలు నమోదుపై ఒక్కో చోట ఒక్కోలా కనిపిస్తోంది. కొంతమంది వెలుగు సిబ్బంది మొబైల్స్‌లో ఈ యాప్ ద్వారా సంఘాల వివరాలు నమోదు కావడంలేదని, సాఫ్ట్‌వేర్ సహకరించడంలేదని వాపోతున్నారు. ఈ విషయాన్ని డీఆర్‌డీఏ జిల్లా అధికారులకు తెలియజేస్తే ఎలాగైనా యాప్‌ను డౌన్‌లోడ్ చేసి ప్రతీ ఒక్కరి వివరాలు నమోదు చేయించాలని ఆదేశిస్తున్నారని వాపోతున్నారు. మరో వైపు ఈ యాప్ వినియోగంపై గ్రామాల్లోని మహిళలు అనాసక్తి చూపుతున్నారని, తమ ఆధార్ కార్డులు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని మహిళా సంఘాల గ్రామైఖ్య అధ్యక్షులు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ లోకోస్ యాప్‌లో వివరాలు నమోదు కొస అంచున నిలిచిపోయింది.



రాజాం వెలుగు కార్యాలయంలో లోకోస్ యాప్‌పై అవగాహన

ఇబ్బందిగా ఉంది..



మా ఆధార్ వివరాలు లోకోస్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే మంచి జరుగుతుందని అన్నారు. ఆధార్ ఇచ్చి అనుసంధానం చేయమన్నాం. ఐతే మా వివరాలు మొత్తం వేరే వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతాయేమోనన్న భయం కూడా మాకు ఉంది.


– సవిరిగాన దమయంతి, వన్నలి, రేగిడి మండలం

అవగాహన లేదు..

లోకోస్ యాప్‌పై గ్రామాల్లో సంఘాల మహిళలకు అవగాహన లేదు. చాలా మంది మహిళలు భయాందోళనలు చెందుతున్నారు. ఈ యాప్‌పై సమగ్రంగా అవగాహన కల్పించాల్సి ఉంది. ప్రతీ మహిళా ఆధార్ కార్డు ఈ యాప్‌లో పొందుపర్చడం ద్వారా సంఘాల పనితీరు, సభ్యులు పనితీరు తెలుస్తుందనేది ఎంత నిజమో.. మహిళల వివరాలు అన్నీ వేరే వారికి తెలుస్తాయన్నది కూడా అంతే వాస్తవం. ఈ విషయంపై గ్రామ స్థాయిలో ఒక క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

– లావేటి సులోచన, ఎంపీపీ, రాజాం

85 శాతం పూర్తయింది..



రాజాం నియోజకవర్గంలో లోకోస్ యాప్ వినియోగంపై పక్కాగా అవగాహన కల్పించాం. ఈ యాప్ వినియోగంపై మహిళలకు గ్రామ స్థాయిలో మరింత అవగాహన కల్పిస్తాం. ఎటువంటి అపోహలు చెందాల్సిన పని లేదు. మహిళా సంఘాల పనితీరు మెరుగుపర్చడంతో పాటు ప్రతీ ఒక్కరికి న్యాయం చేసేందుకు ఈ యాప్ వినియోగపడుతోంది. సాంకేతిక సమస్యలు ఉన్నచోట వాటిని అధిగమిస్తున్నాం. నియోజకవర్గంలో 85 శాతం మేర ఈ యాప్‌లో వివరాలు నమోదు పూర్తయింది.

– ఎ.చిరంజీవి, డీపీఎం, డీఆర్‌డీఏ, విజయనగరం

క్లుప్తంగా

గణేష్ మంటపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

- ఎస్పీ వకుల్ జిందల్



విజయనగరం క్రైమ్: రానున్న వినాయక చవితి సందర్భంగా గణేష్ మంటపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఎస్పీ వకుల్ జిందల్ గురువారం స్పష్టం చేశారు. అలాగే మంటపాల ఏర్పాటుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించబోయే వ్యక్తులు ముందుగా ఒక కమిటీగా ఏర్పడి, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సింగిల్ విండో విధానంలో జ్జి ఇట://జ్బ ఝటజ్జి.ఙ్చరి. ఝ క్లిక్ చేసి, నిర్దేశించిన అనుమతులు పొందాలని సూచించారు. ఈ విధానం వల్ల సులభంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, మంటపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనానికి అనుమతులు పొందవచ్చునని ఎస్పీ తెలిపారు.

తెలుగు కీర్తి పురస్కారానికి గురుప్రసాద్ ఎంపిక



తెలుగు కీర్తి పురస్కారానికి ఎంపికైన గురుప్రసాద్

విజయనగరం: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షుడు, జిల్లా కేంద్రానికి చెందిన రచయిత, తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ తెలుగు భాషా విశిష్ట సేవా పురస్కార గ్రహీత సముద్రాల గురుప్రసాద్ తెలుగు కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో జరగనున్న తెలుగు భాషా దినోత్సవంలో ప్రతిష్టాత్మక తెలుగు కీర్తి పురస్కారం ఆయనకు ప్రదానం చేయనున్నారు.

పరుగు పందెంలో ప్రతిభ



క్రీడాకారుడిని అభినందిస్తున్న ఎంపీడీఓ

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కుమరాం పాలవలసకు చెందిన క్రీడాకారుడు గదుల దుర్గారావు రాష్ట్రస్థాయి పరుగుపందెం పోటీల్లో ప్రతిభ చాటాడు. జిల్లా కేంద్రంలోని విజ్జి స్టేడియంలో జరిగిన 36వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్ ఇంటర్ చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో 5000 మీటర్ల పరుగు పందెంలో జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ నెల 9,10,11 తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 5000 మీటర్ల పరుగుపందెంలో తృతీయ స్థానంలో నిలిచాడు. ఈ క్రీడాకారుడిని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం అభినందించారు. క్రీడల్లో మరింత ఆసక్తిని కనబరచాలని, క్రీడలు ఉన్నత స్థానంలో స్థిరపడేలా ఎదుగుదలకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ కింతాడ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ టీటీఐలకు సత్కారం

తాటిచెట్లపాలెం(విశాఖ): వాల్తేరు రైల్వే డివిజన్ టికెట్ తనిఖీ సిబ్బంది మే నెలలో రికార్డు స్థాయిలో ఆదాయం సాధించారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేరు డివిజన్ పరిధిలో ఉత్తమ ఫలితాలు సాధించిన సిబ్బందిని డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా గురువారం సత్కరించారు. మే నెలలో టికెట్ తనిఖీ సిబ్బంది వివిధ రూపాలలో రూ.2,41,20,627 ఆదాయాన్ని ఆర్జించారు. గత సంవత్సరం మే నెలలో సాధించిన రూ. 2,27,34,221 ఆదాయంతో పోలిస్తే, ఈసారి అధిక ఆదాయాన్ని నమోదు చేశారు. ఈ రికార్డు ఆదాయం సాధించడంలో వ్యక్తిగతంగా ఇద్దరు ఉద్యోగులు అద్భుతమైన పనితీరు కనబరిచారు. విజయనగరం, టీటీఐ వై. అప్పలరాజు.. 836 కేసులు నమోదు చేసి రూ. 4,89,320 జరిమానాలు, అదనపు టికెట్ రుసుముగా వసూలు చేశారు. శ్రీకాకుళం రోడ్డు టీటీఐ కె. శ్రీనివాసరావు 815 కేసులు నమోదు చేసి రూ. 4,42,900 వసూలు చేశారు. వారిద్దరిని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్ సమక్షంలో సత్కరించారు.

వణికిస్తున్న వైరల్ జ్వరాలు

- ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు
- రోజుల తరబడి తీవ్ర జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు
- ఏజెన్సీ కలబోసిన రెండు నియోజకవర్గాల్లో మరింత ప్రభావం



భద్రగిరి పీహెచ్‌సీలో వైద్యం కోసం వచ్చిన జ్వరపీడితులు

పాలకొండ రూరల్/గుమలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా వైరల్ జ్వరాలు వణికిస్తున్నాయి. ప్రస్తుత సీజన్‌లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో కొత్త నీరు సమకూరడంతో పాటు పారిశుధ్య లోపం, డ్రైనేజీల సమస్యలు, నిల్వ ఉండే మురుగు కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. జ్వరప్రభావంతో తీవ్ర చలి, కీళ్ల నొప్పులు, ఆకలి లేకపోవడం, నోరు పూర్తిగా చేదుగా మారడంతో పాటు అధిక ఉష్ణోగ్రతతో కూడిన జ్వరం కనీసం 4–6 రోజులు కొనసాగడంతో జ్వర పీడితులు పూర్తిగా రోగ నిరోధక శక్తిని కోల్పోయే స్థితికి చేరుకుంటున్నారు.

ఏజెన్సీ కలబోసి ఉన్న ప్రాంతంలో..

ఏజెన్సీ ప్రాంతం అధికంగా మిళితమై ఉన్న పాలకొండ, కురుపాం నియోజకవర్గాల పరిధిలో దాదాపు ప్రతి ఇంటా జర్వ పీడితులు ఇద్దరు లేక ముగ్గురు ఉంటున్నారు. గడిచిన 20 రోజుల వ్యవధిలో పాలకొండ ఏరియా ఆస్పత్రిలో 848 మంది వివిధ రకాల జ్వరాలతో చేరారు. 705 మందికి టైఫాయిడ్ పరీక్షలు చేయగా 141 మందికి పాజిటివ్ వచ్చింది, డెంగీ పరీక్షలు 193 మందికి చేయగా నలుగురికి పాజిటివ్ వచ్చింది, 896 మందికి మలేరియా పరీక్షలు చేపట్టగా ఎనిమిది మందికి పాజిటివ్ వచ్చినట్లు రికార్డులు చెబుతున్నాయి. దాదాపు 6 వందల మంది వైరల్, సాధారణ జ్వరాల బారిన పడినట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుతం ఇన్‌పేషెంట్లుగా వందకుపైబడి బాధితులు చేరినట్లు రికార్డులు చెబుతున్నాయి. సగటున రోజుకు ఆరు వందల మేరకు ఓపీ నమోదవుతున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. వారిలో అధిక శాతం జ్వరపీడితులే కావడం విశేషం.

చేతి సొమ్ము చెల్లించి..

సీజనల్ జ్వరపీడితులు రోగనిర్ధారణ పరీక్షలకు అధికమొత్తంలో చేతి సొమ్ము చెల్లిస్తున్నారు. సర్కారు దవాఖానాతో పోల్చుకుంటే రోగుల తాకిడి ప్రైవేట్ ల్యాబ్‌ల వద్ద అధికంగానే ఉంటోంది. గత ప్రభుత్వంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పాటు జ్వరాలపై నిరంతర సర్వే కొనసాగడంతో సీజనల్ జ్వరాలు అదుపులో ఉండేవని గ్రామీణులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో అందించే మందులు కూడా ఆశించిన మేర అందుబాటులో ఉండడం లేదన్న వాదన వినిపిస్తోంది. ముఖ్యంగా బీపీ, గ్యాస్టిక్, రోగనిరోధక శక్తిని అందించే ఐవీ, డైక్లోఫినాక్ ఇంజెక్షన్లు తక్కువగా పీహెచ్‌సీలకు చేరుతున్నట్లు స్పష్టమవుతోంది. నాలుగు నెలలకు ఓ సారి ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే మందుల్లో నిత్యావసర మందు బిళ్లలు, సూది మందులు తక్కువగా వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో రోగగ్రస్తులు ప్రైవేట్ ల్యాబ్‌లు, ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. మలేరియా, టైఫాయిడ్, సీబీసీ, యూరిన్, ప్లేట్‌లెట్స్, వైరల్ జ్వర నిర్ధారణకు రు.600 చెల్లించాల్సి ఉంటుంది. డెంగీ, స్క్రాబ్ టైఫస్ వంటి ప్రాణాంతక జ్వరాల నిర్ధారణకు రూ.వెయ్యి వరకూ చెల్లించాల్సి వస్తుందని బాధితులు చెబుతున్నారు. ఈ లెక్కన ఇంట్లో ఇద్దరు ముగ్గురికి జ్వరం వస్తే రూ.వేలల్లో చేతి సొమ్ము చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.



రక్త పరీక్షల కోసం నిరీక్షిస్తున్న రోగులు

పారిశుధ్య లోపం..కలుషిత నీటి ప్రభావం..

జర్వరాల విజృంభణకు కలుషిత నీరు, పారిశుధ్య లోపమే ప్రధాన కారణంగా వైద్యులు చెబుతున్నారు. తాజాగా జిల్లాలో నమోదవుత్ను అధిక వర్షాల ప్రభావంతో నీటి వనరుల్లో కొత్తనీరు చేరుతోంది. ఎక్కిడికక్కడ మురుగు పేరకుపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి రెండు విడతలు, తాజాగా 16వ ఆర్థిక సంఘానికి సంబంధించి ప్రస్తుత ఆగస్టు నెలలో విడుదల కావాల్సిన మొత్తాలు ఈ ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో బ్లీచింగ్, ఫినాయిల్ కొనేందుకు కూడా పంచాయతీల ఖాతాల్లో నిధులు లేవని ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. సొంత సొమ్ము చెల్లించి ఎంతోకొంత పనులు చేపడుతున్నా ఫలితం లేకపోతోందని అంటున్నారు.

తీవ్రమైన నొప్పులు



గతంలో ఎన్నడూ లేని విధంగా తీవ్రమైన నొప్పులతో కూడిన జ్వరాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఏ ఇంట చూసినా చిన్నాపెద్దా తేడా లేకుండా జ్వరాలు వస్తున్నాయి. రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నాం. స్థానికంగా అందిన వైద్యానికి నయంకాకపోవడంతో జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చింది.

పి.సులోచన, తాడికొండ, జీఎల్.పురం మండలం

జాగ్రత్తలు అవసరం



గతంతో పోల్చుకుంటే టైఫాయిడ్, మలేరియా కాకుండా వైరల్, సాధారణ జ్వరాలు నమోదువుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కాచిచల్లార్చిన నీటిని తాగాలి. రోగ నిరోధక శక్తిని అందించే పౌష్టికాహారం తీసుకోవాలి. ముఖ్యంగా పిల్లల విషయంతో మరింత జాగ్రత్తలు పాటించాలి. వర్షంతో తడవనీయ కూడదు. దుమ్ము ధూళిలో ఆటలాడనీయొద్దు. జలుబు, దగ్గు వస్తే అలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

డాక్టర్ రవికుమార్, ఏరియా ఆస్పత్రి, పాలకొండ

రహదారుల నిర్మాణంలో ప్రభుత్వ నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ ప్రాంత రహదారులకు నెల రోజుల్లోనే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని కూటమి ప్రభుత్వం మాట ఇచ్చి నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గురువారం రేగిడి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్–ఒడిశా రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న పాలకొండ–రాజాం ప్రధాన రహదారి పలు చోట్ల పూర్తిగా పాడవడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధానంగా మజ్జిరాముడుపేట, ఉంగరాడమెట్ట, చిన్నయ్యపేట గ్రామాల జంక్షన్‌ల వద్ద సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.8.82 కోట్ల నిధులు రోడ్ల కోసం మంజూరుచేసిందని, ఆ నిధులుతో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ కొంతమేర పనులను పూర్తిచేశారన్నారు. అప్పట్లో ఎన్నికల కారణంగా నిలిచిపోయిన రూ.4కోట్లు బిల్లులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ మిగిలిన పనులను పూర్తిచేసేందుకు ముందుకురావడంలేదన్నారు. రాజాం జీఎంఆర్ ఐటీ వద్ద 355 మీటర్లు, ఉంగరాడమెట్ట వద్ద 395 మీటర్లు, మజ్జిరాముడుపేట వద్ద 150 మీటర్లు సిమ్మెంట్ కాంక్రీట్ రోడ్డు వేయాల్సి ఉందని, కాంట్రాక్టర్‌కు బకాయిలు చెల్లిస్తే తప్ప ఈ రోడ్డు పనిపూర్తిచేయలేమని ఇప్పటికే కాంట్రాక్టర్ చేతులెత్తేశాడన్నారు.

చెప్పిందొకటి..చేస్తున్నదొకటి

ఈ సమస్యను పలుమార్లు ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఇటీవల కలెక్టర్ అంబేడ్కర్ సంకిలి నాగావళిని చూసేందుకు వచ్చిన సమయంలో ఈ గోతులను స్వయంగా చూశారని చెప్పారు. కూటమి ప్రభుత్వం చెప్పిందొకటి, చేస్తున్నది ఒకటి, ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ప్రగల్భాలు పలుకుతుండడం వారికి వెన్నతోపెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకుంటే శాసనమండలి సమావేశాల్లో ఈ సమస్యను ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని స్పష్టం చేశారు. సమావేశంలో పోలినాటి వెలమ రాష్ట్ర మాజీ డైరెక్టర్ కింజరాపు సురేష్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, లక్ష్మీపురం సర్పంచ్ కెంబూరు వెంకటేశ్వరరావులు ఉన్నారు.

పోర్టల్‌లో నమోదు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న టీఎంఎఫ్ఈఐ జిల్లా నోడల్ అధికారి చొక్కాపు శ్రీనివాస రావు

పార్వతీపురం టౌన్: జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు తమ నోడల్ ఉపాధ్యాయుల ద్వారా మైజీఓవీ.ఐన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని టీఓఎఫ్ఈఐ జిల్లా నోడల్ అధికారి చొక్కాపు శ్రీనివాస రావు తెలిపారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో పొగాకు వాడకం లేని కార్యక్రమాలుగా పోస్టర్ ప్రదర్శనలు, వీధి నాటకాలు, నినాదాల ప్రదర్శనలు, ర్యాలీలు కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. వాటి వీడియోలు, ఫొటోలను వెబ్‌సైట్‌లో ఈ నెల 31 లోపు అప్‌లోడ్ చేయాలని సూచించారు. అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు అమలు కావాలని స్పష్టం చేశారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 50 వేలు, రూ. 20 వేలు, రూ. 15 వేలు కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం హేమసుందర్రావు తదితరులు పాల్గొన్నారు.

నేరాల దర్యాప్తులో డిజిటల్ ఆధారాలు కీలకం

- డీఐజీ గోపీనాథ్ జెట్టి



ఉబెర్ డేటా డిస్‌క్లోజర్ పాలసీ సదస్సుకు హాజరైన ఎస్సైలు

విజయనగరం క్రైమ్: నేరాల దర్యాప్తులో డిజిటల్ ఆధారలే కీలకమని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. ఈ మేరకు రేంజ్ పరిధిలోని అయిదు జిల్లాలకు చెందిన ఐటీ అనుభవం కలిగిన పోలీస్ సిబ్బందికి గురువారం కైలాసగిరి పోలీస్ గెస్ట్‌హౌస్‌లో ఉబెర్ డేటా డిస్క్లోజర్ పాలసీపై వర్క్ షాప్ జరిగింది. నేర సంఘటనలకు సంబంధించి నమోదైన కేసుల విచారణంలో మొబైల్ లొకేషన్ ఆధారంగా నేరస్థులను గుర్తించడంలో ఉబెర్ డేటా ప్రాముఖ్యం గురించి వివరించారు. లీగల్ ప్రాసెస్, డేటా రిక్వెస్ట్ చేయడం, అందుబాటులో ఉంటే సమాచార రకాలు, ప్రైవసీ పరిరక్షణ వంటి అంశాలపై సదస్సు జరిగింది. రేంజ్ పరిధిలో ఉన్న ఐదు జిల్లాల నుంచి ఐటీ కోర్ టీమ్, సైబర్ సెల్ సిబ్బంది పాల్గొని, సాంకేతికతపై సమగ్రంగా చర్చలు జరిపారు.ఈ సందర్భంగా విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు పోలీసుల సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరిచే దిశగా ఎంతో సహాయపడతాయని అన్నారు.

రామతీర్థంలో వైభవంగా పూర్ణాహుతి



యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పుష్యమి నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో రామాయణంలో పట్టాభిషేకం సర్గ హవనం చేసి పూర్ణాహుతి జరిపించారు. ఆలయంలోని వెండి మంటపంలో ఉత్సవమూర్తుల వద్ద నిత్య కల్యాణం జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భక్తి శ్రద్ధలతో తిరువాయ్ మోజి సేవాకాలం: విజయనగరం పట్టణానికి చెందిన పలువురు మహిళా భక్తులు స్వామి సన్నిధిలో తిరువాయ్ మోజి సేవాకాలాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గోష్ఠి ప్రతినిధి రమాదేవి ఆధ్వర్యంలో తిరువాయ్ నామాలను పఠించారు. కార్యక్రమంలో ఈఓ వై శ్రీనివాసరావు, అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, కిరణ్, రామగోపాలాచార్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

ఎవరు చేశారీ పని?

- కలెక్టరేట్ పేరుతో ఉన్న అక్షరాలను తొలగించే ప్రయత్నం



బోర్డులో తొలగించిన అక్షరాలు

పార్వతీపురం రూరల్: కలెక్టరేట్ ముఖద్వారం వద్ద ఉన్న బోర్డులో కలెక్టర్ కార్యాలయం అని సూచించే పదాల అచ్చులను గుర్తుతెలియని అకతాయిలు బుధవారం రాత్రి తొలగించారు. ఈ క్రమంలో కొన్ని పదాలకు సంబంధించిన అక్షరాలు బోర్డులో గురువారం ఉదయం లేకపోవడాన్ని సిబ్బంది గుర్తించి ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈ మేరకు డీఆర్ఓ కె.హేమలత, ఈ చర్యలను తీవ్రంగా పరిగణించి పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చి దర్యాప్తు చేయాలని కోరారు. ఈ మేరకు పార్వతీపురం ఏఎస్పీ అంకితా సురానా, సీఐ కె.మురళీధర్ పరిశీలించి స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

అత్తారింటి వేధింపులపై కేసు నమోదు

పార్వతీపురం రూరల్: పట్టణంలోని కొత్తవలసలో ఉన్న విజయరామరాజు కాలనీకి చెందిన ఓ వివాహిత భర్తతో పాటు అత్తమామలపై వేధింపుల కేసు పెట్టింది. నిత్యం తనను వేధిస్తూ అధిక కట్నం కోసం డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై గోవింద తెలిపారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి



శ్యామల మృతదేహం

రామభద్రపురం: మండలంలోని తారాపురంలో ఓ మహిళ అనుమానస్పద స్థితిలో గురువారం మృతిచెందింది. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తారాపురం గ్రామానికి చెందిన తుమరాడ శ్యామల(41)కు 20 ఏళ్ల క్రితం ఇదే మండలం జన్నివలస గ్రామానికి చెందిన పత్తిగుళ్ల అప్పలనాయుడుతో వివాహం జరిగింది. అయితే భార్యాభర్తల మధ్య కొద్దిపాటి మనస్పర్థలతో వివాహం జరిగిన రెండేళ్లకే విడాకులు తీసుకుని విడిపోయారు. దీంతో శ్యామల గడిచిన 18 ఏళ్ల నుంచి కన్నవారి ఊరు తారాపురంలో వారు ఇచ్చిన పూరింట్లో ఒంటరిగా నివాసం ఉంటూ కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇంతలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. వారిద్దరి మధ్య ఏం జరిగిందో గాని గురువారం తెల్లారేసరికి పురుగు మందు తాగి చనిపోయి ఉంది. పురుగు మందు డబ్బా కూడా మృతదేహం పక్కనే ఉంది. కుటుంబ సభ్యులు పురుగు మందు డబ్బా మురుగు కాల్వలో పారేసి మృతదేహాన్ని దహనం చేసేందుకు శ్మశానానికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు.అయితే మృతురాలి అన్నయ్య తుమరాడ సింహాచలం తన చెల్లిది మృతికి కారణం ఆత్మహత్య కాదని, అనుమానాస్పదంగా ఉందని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్సై అప్పారావు సిబ్బందితో కలిసి తారాపురంలోని ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విజయనగరం నుంచి క్లూస్‌టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. అలాగే శ్యామల మృతికి గల కారణాలను గ్రామంలోని చుట్టుపక్కల నివాసాల ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. మృతురాలి అన్నయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిచ్చు పెట్టిన ‘ఉచిత బస్సు’

- వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బైండోవర్ కేసు

విజయనగరం క్రైమ్ : మహిళలకు కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత బస్ పథకం విజయనగరంలో చిచ్చు పెట్టింది.ఇందుకు సంబంధించి వన్ టౌన్ పోలీసులు గురువారం తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. సింహాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్ విజయనగరం, సింహాచలం ట్రిప్పులో విజయనగరంలోని గాజులరేగకు చెందిన బూడి ఉమామహేశ్వరితో పాటు మరి కొందరు మహిళలు సింహాచలం వెళ్లారు. సింహాచలం కొండపై సీటు విషయంలో డ్రైవర్ ఎస్వీ రమణ తో గొడవకు దిగారు. బస్సులో మహిళలను వెనక సీట్‌లో కూర్చోవాలని, కొంతమంది పురుషులు ఎక్కారని టిక్కెట్ సర్వీసు చేయాలన్నారు. దీంతో మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని బస్ ఎక్కడమే తప్పా? అంటూ గాజులరేగకుచెందిన మహిళలు డ్రైవర్‌తో వాదులాటకు దిగారు. దీంతో డ్రైవర్ కూడా టిక్కెట్ సర్వీస్ అయితే బస్సుకు తద్వారా సంస్థకు ఆదాయం వస్తుందని కొంచెం సర్దు కోవాలని చెప్పాడు. అటు డ్రైవర్, ఇటు మహిళ పాసింజర్ల మధ్య గొడవకు దారి తీసింది. అది కాస్త దుర్భాషలకు చేరింది. ట్రిప్పులో భాగంగా బస్ సర్వీసు విజయనగరం చేరుకుంది. అంతలోనే సదరు మహిళలు ఇంట్లో వారికి చెప్పడంతో భర్తలతో కలిసి సాయంత్రం ఆరున్నర గంటల ప్రాంతంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. సదరు డ్రైవర్‌ను స్టేషన్‌కు పిలిపించి పోలీసులు ప్రశ్నించగా చివరకు తప్పయిందని డ్రైవర్ చెప్పినట్లు స్టేషన్ ఏఎస్సై జగన్మోహన్ రావు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹121	₹212	₹222

ఆక్రమణలకు అడ్డేలేదా?



మండల పరిషత్ ప్రహరీని జేసీబీతో కూల్చివేసిన ఆక్రమణదారులు

- ప్రభుత్వ కార్యాలయాల్లోకి చొరబడుతున్న ఆక్రమణదారులు
- మండల పరిషత్ కార్యాలయ ప్రహరీ జేసీబీతో కూల్చివేత
- కార్యాలయం ఆవరణలో స్థలం యంత్రాలతో చదును
- అడ్డుకున్న మండల పరిషత్ అధికారులు

చీపురుపల్లి: ఆక్రమణదారులకు ఎక్కడైతే ఏముంది. అది ప్రభుత్వ కార్యాలయం కావొచ్చు, ప్రైవేట్ స్థలం అవ్వొచ్చు. ఏదైనా సరే అధికార పార్టీ అండ ఉంటే చాలు ఎలాంటి స్థలంలోనైనా సరే చొరబడిపోవడమే. అయితే ఇంతవరకు ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలను ఆక్రమించుకునే ప్రయత్నాలు చూసి ఉంటాం. కానీ ఇక్కడ సాక్షాత్తు మండల పరిషత్ కార్యాలయం వెనుక ప్రహరీని కూల్చి కార్యాలయం ఆవరణలోకి చొరబడి జేసీబీతో మండల పరిషత్ కార్యాలయం ప్రహరీ లోపల ఉన్న స్థలాన్ని చదును చేసిన సంఘటన సంచలనం రేకెత్తిస్తోంది. ఇదే ప్రహరీకి అవతలి వైపు ఉన్న శ్మశాన వాటిక అభివృద్ధి పనులను మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ గద్దే బాబూరావు చేయిస్తున్నారు. ఈ సమయంలో మండల పరిషత్ ప్రహరీని కూల్చి లోపలకు ప్రవేశించి చదును చేయించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. మండల పరిషత్ గోడ కూల్చి లోపలికి వచ్చి పనులు చేయిస్తుండడాన్ని తెలుసుకున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ ఐ.సురేష్ పనులను నిలిపివేయించారే తప్ప వారిపై చర్యలకు ముందడుగు వేయకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. మండల పరిషత్ కార్యాలయ ప్రహరీ లోపల ఆక్రమణలకు పాల్పడుతున్న స్థలంలో తాగునీటి పైపులు ఉండగా వాటిని తొలగించి ఓ పక్కన పడేయడంతో పైప్‌లైన్ సంగతి ఏమైందో ఇంకా తెలియాల్సి ఉంది.



ప్రహరీ లోపల స్థలాన్ని చదును చేసిన దృశ్యం

సర్వేచేసి చర్యలు తీసుకుంటాం

ప్రహరీ కూల్చి లోపలికి వచ్చి చేపడుతున్న పనులను నిలిపివేశాం. పనులు చేస్తున్న వారిని హెచ్చరించాం. మండల పరిషత్ కార్యాలయం స్థలం ఎంత వరకు ఉందో సర్వే నిర్వహించి, త మ కార్యాలయం పరిధిలోకి ఆక్రమణలు వచ్చి నట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. – ఐ.సురేష్, ఇన్‌చార్జి ఎంపీడీఓ, చీపురుపల్లి

వినాయక మంటపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

- ఎస్సై ఎం.వెంకటరమణ



మక్కువ: ఈనెల 27వ తేదీ నుంచి భక్తులు జరుపుకోనున్న వినాయకచవితి పండగ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటుచేయనున్న వినాయక మంటపాలకు పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్సై ఎం.వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో మంటపాలు ఏర్పాటుచేయనున్న భక్తులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వివరాలు తెలపాలన్నారు. మంటపాల వద్ద డీజేలకు అనుమతిలేదన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా బాణాసంచా కాల్చరాదని, గ్రామాల్లో ఎటువంటి గొడవలుకు తావులేకుండా ప్రశాంతవాతావరణంలో వినాయకచవితి పండగను భక్తులు జరుపుకోవాలని కోరారు. ఏవిధమైన సంఘటనలకు పాల్పడినా కమిటీసభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

మందులు కొరత లేకుండా చూసుకోవాలి

- బందలుప్పి వైద్యాధికారి డా.శ్రీకాంత్



హెచ్‌కారాడవలసలో తనిఖీలు చేస్తున్న డాక్టర్ శ్రీకాంత్

పార్వతీపురం రూరల్: దీర్ఘకాలిక వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం తదితర వ్యాధులు ఉన్నవారికి 104 వైద్యశిబిరం ద్వారా నెలకు సరిపడా మందులు పూర్తిస్థాయిలో అందించి సరఫరా చేసేందుకు మందుల కొరత లేకుండా చూసుకోవాలని బందలుప్పి వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు బందలుప్పి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ఉన్న హెచ్ కారాడ వలసలో 104 వైద్యశిబిరాన్ని ఆయన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60సంవత్సరాల పైబడిన వారికి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి వారికి కావాల్సిన మందులిస్తూ పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని వైద్యసిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో అనారోగ్యం బారిన పడిన వారికి ప్రతి రోజు వైద్యపరీక్షలు చేస్తూ ఎలాంటి లక్షణాలు గుర్తించినా మెరుగైన వైద్యం అందించాలన్నారు.